క్లుప్తంగా

ధరణి సమస్యలపై క్షేత్రస్థాయిలో సర్వే

చండ్రుగొండ: ధరణి సమస్యలపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేకు శ్రీకారం చుట్టారు. ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఈ నెల 1వ తేదీ నుంచి 9 వరకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్న విషయం విధితమే. ఈ క్రమంలో మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో సోమవారం తహసీల్దార్ జి.గదీశ్వర్, ఆర్‌ఐ అక్బర్, సర్వేయర్ యాకుబ్‌బీలు పర్యటించారు. మొత్తం 68 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తహసీల్దార్ జగదీశ్వర్ తెలిపారు. ప్రధానంగా విస్తీర్ణం, సర్వే నంబర్ల మార్పు తదితర సమస్యలున్నాయని, ఈ నెల 9వ తేదీ వరకు పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు.

సామగ్రి పంపిణీ

అశ్వారావుపేట: సాక్షం అంగన్‌వాడీ పోషణ్ 2.0లో భాగంగా అశ్వారావుపేట ప్రాజెక్టు పరిధిలోని ఎంపిక చేయబడిన అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తువులు, ఆట సామగ్రిని సీడీపీఓ రోజ అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. కిషోర బాలికలు, గర్భిణీ, బాలింతలలో పోషణ లోప నివారణ లక్ష్యంతో ఈపథకం పనిచేస్తుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతనం, పోషణ్ అభియాన్ ఇందులో భాగంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ, కెపాసిటీ బిల్డింగ్ పోషణ్ అభియాన్ 2లో చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎంపిక చేయబడిన 38 అంగన్‌వాడీ కేంద్రాలకు గతంలో వాటర్ ఫిల్టర్, ఎల్‌ఈడీ టీవీ అందించగా సోమవారం ఆటవస్తువులు, వంట సామగ్రి, ఇతర సామగ్రిని అందించినట్లు తెలిపారు.

నిర్మాణ పనులు ప్రారంభం

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఎన్‌ఆర్‌టీజీఎస్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మలు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కణితి రాముడు, జానిపాషా, దామెర్ల శ్రీనివాసరావు, అల్లాడి వెంకటేష్, కొండపల్లి నరేంద్ర, మాజీ ఉపసర్పంచ్ గుడ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ డబ్బులు ఇవ్వట్లేదు..

ములకలపల్లి: బ్యాంకులో తమకు రావలసిన ఆసరా పెన్షన్ డబ్బులు ఇవ్వడంలేదని పలువురి లబ్ధిదారులు వాపోయారు. మండల పరిధిలోని ఏపీజీవీ బ్యాంకులో బ్యాంకర్ల తీరును నిరసిస్తూ సోమవారం అందోళన చేశారు. పలువురి లబ్ధిదారుల డబ్బులు రెండేళ్లుగా ఇవ్వడంలేదని ఆరోపించారు. బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈవిషయమై మేనేజర్ నరేశ్‌ను సాక్షి వివరణ కోరగా ఒకే ఒక్క పెన్షన్ లబ్ధిదారుడికి సంబంధించి పంటరుణం బకాయి ఉందని, దీంతో పైఅధికారులు అంకౌంట్ హోల్డ్‌లో పెట్టారని తెలిపారు. అందువల్లనే పెన్షన్ ఇవ్వలేకపోతున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

అశ్వారావుపేట: పదో తరగతి విద్యార్థినులు ధైర్యంగా పరీక్షలు రాసేందుకు అశ్వారావుపేట ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, ప్రభుత్వాస్పత్రి వైద్యుడు పూర్ణచంద్ అవగాహన కల్పించారు. సోమవారం స్థానిక బీసీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంపీపీ మాట్లాడుతూ.. ఒత్తిడికి లోనవకుండా యోగా చేయాలని సూచించారు. డాక్టర్ పూర్ణచంద్ మాట్లాడుతూ.. మనో ధైర్యంగా ఉంటూ ఎక్కువ నీళ్ల తీసుకుంటూ సమయానికి సరైన ఆహారం తీసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ-2 ఆఫీస్‌ను కొత్త ఆఫీస్‌కి తరలిస్తున్న క్రమంలో కార్మికులకు మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఓసీ-2 మేనేజర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ మాట్లాడుతూ.. ద్విచక్రవాహనాలకు సరైన రహదారి, లైటింగ్ సౌకర్యం ఏర్పాటుతో పాటు రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద లారీలు వస్తే వాహనాలు వెళ్లే పరిస్థితి లేదన్నారు. కొత్త సైట్ ఆఫీస్ వద్ద విపరీతమైన డస్ట్‌ను నివారించాలన్నారు. ఎస్‌అండ్‌డీ, డంపర్, డోజర్ సెక్షన్ నుంచి క్యాంటీన్‌కి వెళ్లే నాలాపైన వంతెన నిర్మించాలన్నారు. యూనియన్ ప్రతినిధులు మేకల ఈశ్వరరావు, పిట్ సెక్రటరీ కోడి రెక్కల శ్రీనివాసరావు, బండారి రవికుమార్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ కోడి గుడ్ల రమణ, ప్రసాద్, రాజేందర్ ఉన్నారు.

చిన్నక్క వర్ధంతి సభ

చర్ల: సీపీఎం నాయకురాలిగా, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా పేదల పక్షాన పోరాటాలు సాగించిన ఘనత దివంగత కుంజా చిన్నక్కకే దక్కుతుందని సీపీఎం చర్ల మండల కార్యదర్శి కారం నరేష్ అన్నారు. మండలంలోని ఆర్ కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన చిన్నక్క స్మారక స్థూపం వద్ద ఏర్పాటు చేసిన 4వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. కుంజా అఖిల్, కుంజా స్వేత, కుంజా వెంకటేశ్వర్లు, కారం వెంకటేశ్వర్లు, నూపా కృష్ణ, సీతారామయ్య, భద్రయ్య పాల్గొన్నారు.

చెరువును కమ్మేసిన గుర్రపుడెక్క

- మృత్యువాత పడుతున్న చేపలు, పశువులు
- పొలాలకు అందని సాగునీరు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు


నీటి కోసం చెరువులోకి దిగి మృతి చెందిన ఎద్దు (ఫైల్)


గుర్రపుడెక్కతో నిండిపోయిన గంగోలు చెరువు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో మండల ప్రభుత్వ కార్యాలయాల ఎదురుగా ఉన్న గంగోలు చెరువు నిండా తుంగగడ్డితో పాటు గుర్రపుడెక్క భారీగా పెరిగిపోవడంతో అందులో ఉన్న వందల క్వింటాల చేపలు మృత్యువాత పడుతున్నాయి. పంట పొలాలకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నా సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తనట్టుగా వ్యవహరిస్తున్నారని చెరువు కింద ఆయకట్టు రైతులు, అచ్చితాపురం గ్రామస్తులు ఆరోపణలు చేస్తున్నారు.

సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గంగోలు చెరువులో నిండుగా నీళ్లు ఉన్నప్పటికీ చెరువు మొత్తం గుర్రపుడెక్క మొలిచింది. చుక్క నీరు కూడా బయటకు కనిపించకుండా పచ్చని తివాచీ పరిచినట్లుగా ఉంది. మండల ప్రభుత్వ ప్రధాన కార్యాలయాల ఎదురుగా ఉన్న చెరువు పరిస్థితే ఇలా ఉంటే మారుమూల గ్రామాల చెరువుల పరిస్థితులు ఎలా ఉంటాయే అర్థం చేసుకోవచ్చని ప్రజలు చర్చిస్తున్నారు. మాజీ ఎంఎల్‌సీ బాలసాని లక్ష్మీనారాయణ మండల సర్వసభ్య సమావేశానికి వచ్చినప్పుడు ఈ చెరువును చూసి చాలా అందంగా ఉందని, దీనిని అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఆహ్లాదకరంగా ఉంటుందని అన్నారు. దానికి కావాల్సిన నిధుల గురించి ఎస్టిమేషన్ వేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాని అది నేటికి కార్యరూపం దాల్చలేదు.

పశువులపాలిట మృత్యువుగా..

ఈ చెరువులో ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా అందజేసిన చేప పిల్లలను వదిలారు. అవి ఇప్పుడు పెద్ద పెరిగి ఉన్నాయి. కాగా నీటిపై గుర్రపుడెక్క భారీగా పెరగడంతో వాటికి సరైన ఆక్సిజన్ అందక వందలాది చేపలు మృత్యువాత పడుతున్నాయి.అలాగే చెరువులో నీటిని దాగేందుకు వెళ్లే పశువులు సైతం ఆ గుర్రపుడెక్కకు చిక్కుకుని మృత్యువాత పడుతున్నాయి. అచ్చితాపురం గ్రామానికి చెందిన సోయం నరసింహారావుకు చెందిన ఎద్దు చెరువులో నీటిని తాగేందుకు వెళ్లి ఆ గుర్రపుడెక్క కాళ్లకు చిక్కుకుని చనిపోయింది. దీంతో బాధితుడికి సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లింది. 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులో ఎక్కడ కూడా చుక్క నీరు కనిపింకుండా చెరువు మొత్తం గుర్రపుడెక్క కప్పేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. పాలకులు పట్టించుకోకపోవడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంట పొలాలకు సాగునీరు, స్థానికులకు ఆహ్లాదాన్ని పంచాల్సిన ఈ చెరువు కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతోంది. దీంతో చెరువంతా వ్యర్థాలు, గుర్రపుడెక్కతో నిండిపోయింది.

చెరువులో దిగే పరిస్థితి లేదు



గ్రామానికి దగ్గరలో ఉన్న చెరువులో వేసవి సమయంలో నిత్యం సాయంత్రం గ్రామంలోని యువకులు సరదగా ఈత కొట్టేందుకు చేపలు పట్టేందుకు వెళ్లేవారు. సరదగా సమయం గడిపేవారు. ప్రస్తుతం చెరువు నిండా గుర్రపుడెక్కతో పాటు తుంగగడ్డి మొలిచి ఉండటంతో చెరువులోకి వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. పశువులు మృత్యువాత పడుతుండటంతో పశువులను చెరువు వైపు వెల్లాకుండా చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

– పూనెం రామ్మూర్తి, అచ్చితాపురం

గుర్రపుడెక్కను తొలగించాలి



చెరువుపై పేరుకుపోయిన గుర్రపుడెక్క వల్ల రైతులు వ్యవసాయం చేసుకోలేక పోతున్నారు. గుర్రపుడెక్క వర్షం పడిన సమయంలో చెరువు నిండి పోయి చెరువు కింద ఉన్న పొలాల్లోకి పోయి మొత్తం పేరుకుపోతుండటంతో రైతులు వ్యవసాయం చేయలేని పరిస్థితి వచ్చింది. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే చెరువుపై పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగించాలి. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుంది.

– సోయం కామరాజు, అచ్చితాపురం

పీహెచ్‌సీలో తహసీల్దార్ తనిఖీ


పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగప్రసాద్

కరకగూడెం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తహసీల్దార్ నాగప్రసాద్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ఆదర్శంగా నిలవాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పరిసరాలను పరిశీలించారు. సామాన్య రోగుల మాదిరిగా వరుసలో కూర్చొని సిబ్బందితో బీపీ చెక్ చేయించుకురు. వైద్యాధికారి కారం మధుతో సమావేశం అయ్యి పీహెచ్‌సీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆశ కార్యకర్తలు గ్రామాల్లోని ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తుంటే.. వారినే పరిసరాలు శుభ్రం చేయాలని స్థానికులు అంటున్నట్లు తహసీల్దార్ దృష్టికి వైద్యాధికారి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అయన వెంటనే తహసీల్లో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి సమస్యను వివరించారు. అంతే కాకుండ గ్రామాల్లో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. అలాగే రేషన్ డీలర్లుతో సమావేశం ఏర్పాటు చేసి ప్రజా పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం మీసేవ నిర్వాహకులతో కూడా సమావేశం నిర్వహించి ప్రజల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీటీ సంధ్య, ఆర్‌ఐలు షేక్ హుస్సేన్, రాజు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మండలంలో నెలకొన్నపలు ప్రధానమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఎం, టీడీపీ పార్టీల ఆధ్వర్యంలో కరకగూడెం తహసీల్దార్ నాగప్రసాద్కు తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మండలంలో ఆధార్ కేంద్రం లేకపోవటంతో దూర ప్రాంతాలకు ప్రజలు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అనేక గ్రామాల్లో జనాలు వేసవికాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని వివరించారు. అలాగే మిషన్ భగీరథ పనులు కూడా చాలా కాలనీల్లో అసంపూర్ణంగానే ఉన్నాయని, మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించేందుకు తగిన కృషి చేయాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి కొమరం కాంతారావు, టీడీపీ మండల అధ్యక్షుడు సిరిశెట్టి కమలాకర్, చెర్ప సత్యం పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతుల వెల్లువ

మణుగూరురూరల్: గత ఏడాది గోదావరి వరదల కారణంగా ముంపునకు గురైన వరద బాధితులకు, ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ ప్రగతిశీల మహిళా సంఘం భద్రాచలం డివిజన్ కమిటి ఆధ్వర్యంలో సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వారి నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం డివిజన నాయకురాళ్లు పెద్దగోని ఆదిలక్ష్మి, సున్నం భూలక్ష్మిలు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వరద ముంపు బాధితులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. బాధితుల ఇబ్బందులను సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని వారు పాయంను కోరారు. పీఓడబ్ల్యూ నాయకురాళ్లు కోడిమ రాధ, జీఎల్‌బీకెఎస్ రాష్ట్ర కార్యదర్శి నాసర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని..

మణుగూరుటౌన్: మండల పరిధిలోని సమితిసింగారం గ్రామంలోని ఉడతానేని గుంపు (ఎస్సీ కాలనీ)లో 30 సంవత్సరాలుగా చీకట్లో మగ్గుతూ జీవనం కొనసాగిస్తున్నామని ఆ గ్రామస్తులు ఉసికల కొండయ్య ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరెంట్ స్తంభాలు, డ్రెయినేజీలు, రోడ్డు సౌకర్యం లేక తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వానకాలం పాములతో సహవాసం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విద్యుత్ శాఖ ఏడీఏతో మాట్లాడి నివేదిక తెప్పించుకుని పనులు త్వరలో ప్రారంభించే విధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో నవీన్, నరేశ్, రాజాబాబు, లక్ష్మణ్‌రావు తదితరులు ఉన్నారు.

'ప్రజా పాలన' సేవా కేంద్రం ఏర్పాటు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారెంటీ పథకాల అమలు కోసం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. అశ్వారావుపేటలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, ప్రజా పాలన కార్యక్రమానికి సంబంధించిన దరఖాస్తులను స్వీకరించేలా చర్యలు చేపట్టారు. అభయహస్తం పథకాలకు అన్ని అర్హతలు ఉండి, ఇంకా దరఖాస్తులు చేసుకుని లబ్ధిదారులు ఈ సేవా కేంద్రంలో తమ దరఖాస్తులను అందించేలా వెసులుబాటు కల్పించారు. లబ్ధిదారుల కోసం ఏర్పాటు చేసిన ఈ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు కోరారు. కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్ ఎం.కుమారి ఆధ్వర్యంలో లబ్ధిదారుల నుంచి ఆయా పథకాలకు సంబంధించిన పలు దరఖాస్తులను స్వీకరించారు.


సేవా కేంద్రంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కార్మికుల పిల్లలకు పల్స్‌పోలియో

చర్లరూరల్: పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా రెండో రోజు సోమవారం వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న కార్మికుల వద్దకు వెళ్లి వారి పిల్లలకు కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పోలియో చుక్కలను వేశారు. మిర్చి తోటలు, ఇటుకల తయారీ కేంద్రాల్లో, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భవన నిర్మాణ కార్మికుల పిల్లలను గుర్తించి పని చేస్తున్న ప్రదేశాలకు వెళ్లి పోలియో చుక్కలను వేశారు. హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ వేణు గోపాలకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు ధర్మారావు, నరసింహారావు, ఆశా కార్యకర్త లలితమ్మలు పాల్గొన్నారు.

సాహితీ సదస్సుకు ఆహ్వానం

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులకు అఖిల భారతి సాహితీ సదస్సులో ప్రసంగించేందుకు అవకాశం దక్కింది. ఈ మేరకు సోమవారం ప్రభాకరాచార్యులు విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 9, 10వ తేదీల్లో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి ఆధ్వర్యంలో ఏపీలోని కాకినాడ వద్దగల దంటు కళాక్షేత్రంలో నిర్వహించే అఖిల భారత సాహితీ సదస్సులో 10వ తేదీన ప్రసంగించేందుకు నిర్వాహకుల ద్వారా ఆహ్వానం వచ్చిందన్నారు.

నేస్తం ట్రస్ట్ చేయూత

బూర్గంపాడు: అశ్వాపురం మండలం నెల్లిపాక బంజర గ్రామానికి చెందిన నిరుపేద నాయీ బ్రాహ్మణుడు శీలం వెంకటేశ్వరరావు జీవనోపాధికి మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ చేయూత నందించింది. క్షవర వృత్తి చేసుకునే అతనికి సెలూన్ లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలిసిన నేస్తం ట్రస్ట్ ప్రతినిధులు అతని వృత్తికి అవసరమైన సెలూన్ షాపును ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన ఆర్థికసాయమందించారు. ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండారెడ్డి,చింతా అంకిరెడ్డి, సంకా సురేష్, సోము రఘునాథ్‌రెడ్డి, బత్తుల రామకొండారెడ్డి, కైపు రమేష్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం ఖాయం

భద్రాచలంటౌన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ అన్నారు. భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య నివాసంలో ఆయన సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరయ్య పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ గత ఐదు సంవత్సరాలలో జిల్లాలో పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, కొత్వాల్ శ్రీను, ఆళ్ల వెంకట్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనతో మంచి రోజులు


లబ్ధిదారులకు జీరో బిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక: రాష్ట్రంలో ప్రజా పాలనతో మంచి రోజులు నడుస్తున్నాయని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం ఎల్చిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో గృహజ్యోతి పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై లబ్ధిదారులకు జీరో కరెంటు బిల్ తీసి అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు అమలులో భాగంగా గృహ జ్యోతి ఉచిత కరెంట్ పథకం అమలు చేస్తోందని తెలిపారు. ఈ నెల 11న సీఎం రేవంత్ రెడ్డి భద్రాచలం పర్యటించనున్నారని, ఈ పర్యటనలో ఆరు గ్యారంటీలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ పథకాన్ని ప్రారంభించడం జిల్లా వాసుల అదృష్టమన్నారు. అనంతరం పినపాక ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గోపాలరావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన జర్నలిస్ట్ క్రికెట్ టోర్నమెంట్ను ప్రారంభించారు.అనంతరం ఇటీవల అనారోగ్యం కారణంతో మృతి చెందిన పోతురెడ్డిపల్లి గ్రామానికి చెందిన తునికి బాబూరావు దశదిన ఖర్మలకు హాజరై బాబురావు చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు కార్యక్రమంలో పినపాక మండల కాంగ్రెస్ అధ్యక్షులు గొడిశాల రామనాథం, యూత్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కొర్స ఆనంద్,నాయకులు గంగిరెడ్డి వెంకట రెడ్డి, గట్ల శ్రీనివాసరెడ్డి, పేరం వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, కస్తూరి లింగయ్య, దాట్ల రాజేష్, తోలెం అర్జున్, వీరా స్వామి,వర్మ పాల్గొన్నారు.

పరామర్శ..

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీ ఎస్టీ కాలనీలో సోమవారం జరిగిన కుంజా బోడమ్మ దశదిన కర్మలకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించడంతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అదే గ్రామంలో ఇటీవల మరణించిన తాటి పొట్టెమ్మ వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. తొలుత పొట్టెమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మావోలు జన జీవనంలో కలవాలి

దుమ్ముగూడెం: కాలం చెల్లిన సిద్ధాంతాలతో మావోయిస్టు పార్టీ తెలంగాణలో మనుగడని ఎప్పుడో కోల్పోయిందని, జనజీవన స్రవంతిలో కలిసి సాధరణ జీవితం గడపాలని దుమ్ముగూడెం పోలీసులు సూచించారు. ఈ మేరకు మండలంలోని పెద్దబండిరేవు క్రాస్ రోడ్డు, పెద్దనల్లబల్లి, చిన నల్లబల్లి, ములకపాడు ప్రధాన రహదారిపై ఫ్లెక్సీలను సోమవారం ఏర్పాటు చేశారు. మావోయిస్టు పార్టీలో ప్రస్తుతం పని చేసే నాయకులు, దళ సభ్యుల కోసం వారి కుటుంబ సభ్యులు ఎంతగానో ఎదురుచూస్తున్నారని, ఇప్పటికైనా తమ కుటుంబ సభ్యుల కోసం జనజీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి అందే అన్ని రకాల ప్రతిఫలాలను అందజేసే విధంగా పోలీస్ శాఖ కృషి చేస్తుందని తెలియజేస్తున్నట్లు ఫ్లెక్సీల్లో పేర్కొన్నారు.

'లా' కళాశాల ఏర్పాటు చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం కేంద్రంగా గోండ్వానా లా కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. పీఓ ప్రతీక్ జైన్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోడ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాణ మాట్లాడుతూ.. పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో లా కళాశాల ఏర్పాటు చేస్తే ఆదివాసీ విద్యార్థులకు న్యాయ శాస్త్రం చదువుకుని ఆదివాసీ చట్టాలు, హక్కులపై అవగాహనతో ముందుకు వెళ్లగలుగుతారని అన్నారు. జూన్ మొదటి వారంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ముందు ధర్నా చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కీసర రాంబాబు, కనితి వెంకటకృష్ణ, పూనెం సాయి, నూనెం ప్రతాప్, సున్నం సుబ్బయ్య, సన్నాసి, వెంకటేశ్వర్లు, వెంకన్నబాబు పాల్గొన్నారు.

వరిపంట బాగానే ఉంది..


ఏఎంఓ కరుణామయికి వాంగ్మూలం అందజేస్తున్న రైతులు

ములకలపల్లి: నాణ్యత లోపించిన విత్తనాల మూలంగా పంటల దిగుబడికి అడ్డంకులు ఏర్పడ్డాయిని వ్యవసాయ అధికారులకు ఫిర్యదులు అందిన నేపథ్యంలో.. తాము సాగుచేస్తున్న వరిపంట ఆరోగ్యంగానే ఉందని తాళ్లపాయకు చెందిన రైతులు కారం రాంబాబు, మడివి సూర్యం, ఒగ్గెల వీరస్వామి, ఒగ్గెల భూషణం, కీసరి వెంకటేశ్ వివరించారు. ఈ మేరకు సోమవారం మండల వ్యవసాయాధికారిణి (ఎంఏఓ) కరుణామయికి ఓ వివరణ పత్రం అందజేశారు. ములకలపల్లిలో ఓవిత్తన దుకాణంలో తాము కొనుగోలు చేసిన వరి విత్తనాలు నకిలీవిగా పేర్కొంటూ.. పంట సక్రమంగా ఎదగలేదంటూ కొందరు రైతులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. అయితే తమ ప్రమేయం లేకుండానే ఫిర్యాదులో తమ పేర్లు ఉపయోగించారని స్పష్టం చేశారు. తాము ఖరీదు చేసిన విత్తన వరిపంట మంచి ఎదుగుదలతో, ఆరోగ్యకరంగా ఉందని వారు తెలిపారు. ఈ మేరకు అధికారులకు వాంగ్మూలం అందజేశారు.

మంత్రి పొంగులేటి పరామర్శ


మృతుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

దమ్మపేట: మండల పరిధిలోని నాచారం గ్రామంలో ఇటీవలే మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యలను, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. సోమవారం నాచారం గ్రామంలో ఇటీవలే మృతి చెందిన రాజులపాటి కృష్ణయ్య చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. అనంతరం అదే గ్రామంలో పలు శుభకార్యాలకు హాజరై, వధూవరులకు నూతన వస్త్రాలను బహుకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మువ్వా విజయ్‌బాబు, సొసైటీ చైర్మన్ ఏల్లిన రాఘవరావు, కాంగ్రెస్ నాయకులు కక్కిరాల రమేష్, చీకటి ఆదినారాయణ, ఎర్రగొర్ల రాధకృష్ణ, అన్నవరపు నాగేంద్ర పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పని చేస్తున్న కోల్ శాంపిల్స్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మీనారాయణలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కోల్ శాంపిల్స్ కార్మికులు వారి సమక్షంలో ఏఐటీయూసీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం కోల్ శాంపిల్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి డి.సుధాకర్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు టి.రమేష్, ఏఐటీయూసీ నాయకులు రాంనరసయ్య, నాగరాజు, ఆదర్ల సురేందర్, సీతారాములు, ఎస్‌కె.సర్వర్, రాయలింగు పాల్గొన్నారు.

విజేతగా భద్రాద్రి జట్టు

భద్రాచలంటౌన్: భద్రాచలం కేంద్రంగా 6 జిల్లా స్థాయి బెంచ్ ప్రెస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పట్టణానికి చెందిన సిటీ స్టైల్ జిమ్ జట్టు విజేతగా నిలిచిన్నట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రెటరీ జీవీ రామిరెడ్డి తెలిపారు. స్థానిక గిరిజన భవన్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలు సోమవారంతో ముగిశాయి. విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీ, ప్రశంస పత్రాలను అందజేసినట్లు ఆయన తెలిపారు.

సీసీ కెమెరాలు వితరణ

భద్రాచలంఅర్బన్: ఇటీవల భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్ పట్టణంలో ఉన్న అన్ని ఆటో యూనియన్లతో ఓ సమావేశం నిర్వహించి, ప్రతి ఆటో అడ్డలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందిగా ఆయన కోరారు. ఇందుకు భద్రాచలం పట్టణంలోని శ్రీనివాస నర్సింగ్ హోం అధినేత డాక్టర్ మోహన్ రావు 3 సీసీ కెమెరాలు, ఆర్టీసీ ఇన్ గేట్ ఆటో యూనియన్ సభ్యులు 1 సీసీ కెమెరాను వితరణకు సోమవారం ముందుకువచ్చారు. ఈ సీసీ కెమెరాలను వితరణ గా భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ కు అందించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. నేరస్తులను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగ పడుతాయని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేస్తూ పోలీసులకు పట్టుబడిన తరువాత నేరాలు రుజువైతే సరైన శిక్ష పడుతుందని ఆయన హెచ్చరించారు. అనంతరం సీసీ కెమెరాలు వితరణగా అందించిన దాతలను, అదే విధంగా సీసీ కెమెరాలు వినియోగంపై ఆటో యూనియన్ సభ్యులకు అవగాహన కల్పించిన భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్‌ను భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు. కార్యక్రమంలో శ్రీనివాస నర్సింగ్ హోమ్ నిర్వాహకులు హర్షవర్ధన్, ఆర్టీసీ ఇన్ గేట్ ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలు వితరణగా అందించిన వారిని అభినందిస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్